సాక్షి
వికారాబాద్

గురువారం । 21 । డిసెంబర్ । 2023



కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్విని యోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్త అన్నారు. 8లో ▸



స్థలమిచ్చారు.. నిధులిస్తారు..

కోస్గి ఆర్టీసీకి త్వరలో మంచిరోజులు రాను న్నాయి. రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో డిపో అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. . 8లో ▸



పత్తి రైతుల గోస

పత్తి రైతులకు ప్రతి ఏటా గోస తప్పడం లేదు. గతంలో పత్తి మిల్లులు అందుబాటులో లేక ఇబ్బంది పడ్డారు. 9లో ▸

న్యూస్‌రీల్

పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న గోపాల్

దోమ: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండలం లోని కొండాయపల్లిలో వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం మండల వ్యవ సాయ అధికారి ప్రభాకర్ రావుతో కలసి పం టల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. యాసంగి పం టలకు చీడ పీడల బెడద ఎక్కువగా ఉంటుం దని, రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిం చారు. పంట మార్పిడితో దిగుబడి పెరిగే అవ కాశం ఉంటుందని తెలిపారు. ఆరుతడి పం టలు లాభసాటిగా ఉంటాయని, వాటి సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.

వికారాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



ఆలంపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంజుల తదితరులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపా లిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తెలిపారు. బుధ వారం పట్టణంలోని 9, 13, 14వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి వార్డులో యూజీడీ ఏర్పాటు చేస్తామని తెలి పారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాం గ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, మాజీ జెడ్పీటీసీ ముక్తార్ షరీఫ్, మున్సిపల్ కమి షనర్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి 2024 – 25 సంవత్సరానికి గాను అర్హులైన విద్యార్థులు జనవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఆర్‌సీఓ శారద బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. విద్యా ర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆమె కోరారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టండి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీలు

తలకొండపల్లి: తలకొండపల్లి మండల ఎంపీపీ నిర్మలపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాల ని కందుకూర్ డివిజన్ ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు మండల ఎంపీటీసీలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ మెజార్టీ నిరూపించుకో వాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎం పీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హేమరాజు తదితరులు పాల్గొన్నారు.

‘కోట్‌పల్లి’పై కోటి ఆశలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే పెద్ద ప్రాజెక్టు

- సాగు నీరందక వలస బాట పట్టిన రైతన్నలు
- ప్రకటనలకే పరిమితమైన గత పాలకులు
- చొరవ చూపాలంటున్న ఆయకట్టు రైతులు



కోట్‌పల్లి ప్రాజెక్టు

పెద్దేముల్: జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం, వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా ఉండడంతో కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధిపై ఆయకట్టు రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే పెద్దది. కోటపల్లి ప్రాజెక్టు కింద పెద్దేముల్, ధారూర్ మండలాల్లోని 9,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే కాలువలు, షట్టర్లు దెబ్బతినడంతో కేవలం 4వేల ఎకరాలకే నీరందుతోంది. అంతేకాకుండా సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది, అధికారుల నిర్ల క్ష్యంతో సాగునీటి కాలువలు కబ్జాలకు గురవు తున్నాయి. ఆయకట్టు చివరి భూములు బీళ్లుగా మారుతున్నాయి. వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్ స్పీకర్‌గా ఉండటం, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావ డంతో రైతన్నలు గంపెడాశలు పెట్టుకున్నారు.

9,200 ఎకరాలకు సాగునీరు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్న సమయంలో కోట్‌ప ల్లి ప్రాజెక్టు జిల్లాకే తలమానికం. 1967లో ఈ ప్రాజె క్టును నిర్మించారు. దీని పరిధిలోకి పెద్దేముల్, ధారూరు మండలాలు వస్తాయి. 19 గ్రామాలు, కుడి, ఎడమ, బేబీ కాలువల ద్వారా 9,200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువలు, షెట్టర్లు దెబ్బతిన్నా గత ప్రభుత్వాలు పట్టించు కోలేదు. ప్రాజెక్టు నిర్మించి సుమారు 50ఏళ్ల కావస్తున్నా ఇప్పటి వరకు చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. దీంతో ధారూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన కొంత మంది రైతులు వలస వెళ్లారు. మరి కొంత మంది ఉన్న భూములను విక్రయిస్తున్నారు. పెద్దేముల్, ధారూరు మండలాల్లోని బుద్దారం, తింసాన్‌పల్లి, పెద్దేముల్, జనగాం, గట్టిపల్లి, రాళ్ల రుద్రారం, పెద్దే ముల్ తండా, బండపల్లి, రుక్మాపూర్, రెగొండి, బుద్దారం, మదనంతపూర్, చైతన్యనగర్, రుక్మాపూర్, మంబాపూర్, దుగ్గాపూర్, మారేపల్లి తండాల్లోని పొలాలకు కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి నీరందేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కోటపల్లి ప్రాజెక్టు దశ మారుతుందని ఆయకట్టు రైతులు ఎంతో ఆశ పెట్టుకున్నారు. కానీ గత ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధి, మరమ్మతులను పట్టించుకోలేదు. పలుసార్లు కాలువలు, తూముల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండా పోయింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

కోటపల్లి ప్రాజెక్టుకు గతంలో ఏఈ, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, 15 మంది గ్యాంగ్‌మెన్లు ఉండే వారు. ప్రస్తుతం సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రాజెక్టు కార్యాలయం అధ్వానంగా మారింది. సిబ్బంది లేక, నీరు అందక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధి, మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. కాలువలు బాగు చేసి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి. అప్పుడే 19 గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది.

– వెంకటరెడ్డి, కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్

చివరి ఆయకట్టుకు నీరందాలి



కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలు, తూములకు మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు భూములకు నీరు అందేలా చూడాలి. ఏటా రెండు పంటలకు నీరు వదిలితే వలస వెళ్లిన రైతులు తిరిగి గ్రామాలకు వస్తారు. ఆ దిశగా కొత్త ప్రభుత్వం చొరవ చూపాలి.

– వెంకటయ్య, మాజీ సర్పంచ్, బుద్దారం

రూ.90 కోట్లతో ప్రతిపాదనలు

కోటపల్లి ప్రాజెక్టు మరమ్మతుల కోసం ఆరు నెలల క్రితం గత ప్రభుత్వానికి రూ.39 కోట్లతో ప్రతిపాద నలు పంపాం. కానీ నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం రూ.90 కోట్ల నిధుల కోసం ప్రతిపాద నలు సిద్ధం చేస్తున్నాం. సిబ్బంది కొరత విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం.

– నవీన్, ఏఈ కోటపల్లి ప్రాజెక్టు

గుడ్‌విల్.. వసూల్!



- గుడ్‌విల్ పేరుతో మద్యం షాపుల నుంచి అక్రమ వసూళ్లు
- ఎక్సైజ్ అధికారులపై ఆరోపణల వెల్లువ
- జిల్లాలో కొత్తగా ఏర్పాటైన 59 దుకాణాలు

వికారాబాద్: ఎక్సైజ్ శాఖ అధికారులు గుడ్‌విల్ వేటకు తెర తీశారు. ఈ విషయం ఇప్పుడు మద్యం వ్యాపారుల్లో చర్చనీయాంశంగా మారింది. కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి 15 రోజులు గడు స్తున్న తరుణంలో షాపులు దక్కించుకున్న వారి నుంచి గుడ్‌విల్ పేరుతో పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటు న్నాయి. మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది మొదలు జిల్లాలో ఎక్సైజ్ అధికా రులు లోపాయికారిగా వ్యవహరిస్తున్నారనే విమ ర్శలు వస్తున్నా దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. టెండర్ల సమయంలో కొందరు బడా మద్యం వ్యాపారులతో కుమ్మక్కై సమాచారం లీక్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది సద్దుమనగక ముందే గుడ్‌విల్ పేరుతో మరోసారి వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు వచ్చిన మద్యం దుకాణంలో ఆశించిన మేరకు అమ్మకాలు కావడంలేదని మొత్తుకున్నా.. గుడ్‌విల్ విషయంలో ఎక్సైజ్ అధికారులు వెనక్కి తగ్గడం లేదని ఓ యజమాని వాపోయారు.

నిబంధనలు గాలికి

దుకాణాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం గతేడాది నుంచి ప్రత్యేక నిబంధనలు రూపొందించి నప్పటికీ అవి ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. షాపుల ఏర్పాటు సమయంలో దుకాణాదా రులు పాటించాల్సిన నిబంధనలు ప్రభుత్వం ముం దుగానే విడుదల చేసినా వాటిని అమలు చేయడం లో జిల్లా ఎక్సైజ్ అధికారులు పూర్తిగా విఫలమవు తున్నారు. పూడూరు మండలం మన్నెగూడ సమీ పంలోని ఎన్కెపల్లిగేట్ వద్ద ఆలయానికి 50 మీటర్ల దూరంలోనే మద్యం షాపు ఏర్పాటు చేశారు. వికా రాబాద్ ఎస్పీ కార్యాలయానికి ఎదురుగా మద్యం దుకాణం ఉంది. ఇది బాలికల పాఠశాల పక్కనే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయాన్ని పలుమార్లు కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ప్రధానంగా మద్యం దుకాణాల ముందు పార్కింగ్ స్థలాలు ఉం డాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

వేలల్లో గుడ్‌విల్

పదిహేను రోజుల క్రితం కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు గుడ్‌విల్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసూళ్లు చేస్తున్న మొత్తం పైస్థాయి అధికారులకు కూడా వాటా ఉం దని తమతో చెబుతున్నట్లు మద్యం వ్యాపారులు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 59 మద్యం దుకా ణాలు ఉండగా ఒక్కో షాపు నుంచి రూ. 60 వేల అమ్మకాలను బట్టి రూ. లక్ష వరకు వసూళ్లు చేస్తు న్నట్లు తెలిసింది. ఈ లెక్కన గుడ్‌విల్ పేరుతో దాదాపు రూ. 35 లక్షల నుంచి అరకోటి వరకు వసూళు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఫిర్యాదు చేస్తే భవిషత్‌లో తమను ఇబ్బందులు గురి చేస్తారనే భయంతో మిన్నకుండిపోతున్నట్లు మద్యం వ్యాపారులు తెలిపారు.

అలాంటిదేమీలేదు

గుడ్‌విల్ పేరుతో డబ్బు వసూళ్లు చేస్తున్నారనే ఆరో పణల్లో నిజం లేదు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. త్వరలో అన్ని దుకాణాల వద్ద నిబంధనలు పాటించేలా యజమానులకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రతి షాపు వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

– నవీన్‌చంద్ర, ఎక్సైజ్ సూపరింటెండెంట్

‘నూతన’ వేడుకలపై నిఘా

- ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: నూతన సంవత్సర వేడుకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిసార్టు, ఫాంహౌస్‌లలో న్యూ ఇయర్ వేడుకలు జరిగే అవకాశం ఉన్నందున వాటిపై నిఘా ఉంచుతామని తెలిపారు. డీజే, సౌండ్ బాక్సులకు అనుమతులు లేవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిసెంబరు 31వ తేదీ బైక్ ర్యాలీలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రతి పీఎస్ పరిధిలో నాకాబందీ నిర్వహిస్తామని తెలిపారు. ఎవరైనా పెద్ద ఎత్తున న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ చేయాలనుకుంటే పోలీసు, ఇతర శాఖల నుంచి ముందస్తు అను మతులు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఈవెం ట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. అలాగే పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. లిక్కర్ ఈవెంట్స్‌లో మైనర్లకు అనుమతి లేదన్నారు. న్యూ ఇయర్ వేడు కల్లో డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. 31వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంటకు బహి రంగ ప్రదేశాల్లో వేడుకలు ముగించాలన్నారు. పోలీసు శాఖ జారీ చేసే సూచనలను విధిగా పాటిం చాలని తెలిపారు.

ఫిబ్రవరి 8న తుది ముసాయిదా



మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

- కలెక్టర్ భారతి హోళికేరి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో వెబినార్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటరు జాబితాకు సంబంధిం చి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరి ష్కరించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్.. జిల్లా కలెక్టర్లు, ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ భారతి హోళికేరి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో, సాఫీగా నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలి పారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా నిర్వహణపరమైన ఏర్పాట్లపై దృష్టిని కేంద్రీకరిస్తామని.. ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన అంశాలతో కూడిన వివరాలను సిద్ధం చేస్తామన్నారు. జనవరి 6న ముసాయదా ఓటరు జాబితా విడుదల చేసి, జనవరి 22 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని.. ఫిబ్రవరి 2లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా రూపొందించేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని కలెక్టర్ అన్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీ లించడంతో పాటు ఏవైనా లోటుపాట్లు ఉంటే సవ రించడం, పేర్లు తొలగించిన వాటి విషయంలో ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలిస్తామని, డూప్లికేషన్లు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మరణ ధ్రువీక రణ పత్రాల ఆధారంగా వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు తదిత రులు పాల్గొన్నారు.

15 ఏళ్ల కల నెరవేరింది

- నన్ను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా
- అసెంబ్లీ సమావేశాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భావోద్వేగం



షాద్‌నగర్: ‘అధ్యక్షా..’ రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ జీవితంలో ఒక్కసారైనా అసెంబ్లీలో ఈ మాట అనాలని ఉంటుంది. అయితే కొందరికే అది సాధ్యమవుతుంది. సుమారు 15 ఏళ్ల ఎదురుచూ పుల తర్వాత ఈ అవకాశం తనకు దక్కిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భావోద్వేగ ప్రసంగం చేశారు. ఈ క్రమంలో తొలి అసెంబ్లీ అను భవాలు ఆయన మాటల్లోనే.. కొన్ని కొన్ని సంఘట నలు జీవితంలో మరుపురానివిగా మిగిలిపోతుం టాయి. నాతొలి అసెంబ్లీ అనుభవం కూడా అలాం టిదే. నా అదృష్టం ఏమిటంటే నాతో పాటు నాపార్టీ కూడా రాష్ట్రంలో అధికారంలో వచ్చింది. తొలి అడుగులోనే అధికార పార్టీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కూర్చోవడం నాకు దక్కిన అదృష్టంగా భావి స్తు న్నాను. మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అనుభవ జ్ఞులైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మం త్రులతో అసెంబ్లీలో గడిపిన తొలి క్షణాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నికైనప్పుడు తొలిసారిగా అసెంబ్లీలో మాట్లాడే అవకాశం దక్కింది. ఆయన గురించి రెండు మాట లు చెప్పే అవకాశం రావడం, అలాగే సీఎం రేవం త్‌రెడ్డి అసెంబ్లీలో నా పేరును ప్రస్తావించడం మరి చిపోలేని అనుభూతిని ఇచ్చిందని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

- పనులను రద్దు చేస్తే ఊరుకోం
- పార్టీకి నమ్మకద్రోహం చేసిన వారిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం
- తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాండూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు ప్రారంభించామని, వాటిని ప్రస్తుత ఎమ్మెల్యే రద్దు చేయాలని ఆదేశించడం సరికాదని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో ఉంటూ పార్టీ గెలుపుకోసం పని చేయని నమ్మకద్రోహులపై అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. వెంట నడిచిన వారే తన ఓటమికి కారణమయ్యారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలో నియోజక వర్గ అభివృద్ధికి రూ.1,670 కోట్లు తెచ్చినట్లు వివరించారు. అయితే కొన్ని పనులు పూర్తయ్యాయని తెలిపారు. మరి కొన్ని మొదలు పెట్టాల్సి ఉందన్నారు. ప్రారంభంకాని పనులను రద్దు చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, అది ఏమైందని నిలదీశారు. మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి ప్రతి మహిళకు రూ. 2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీణా, బీఆర్‌ఎస్ పెద్దేముల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అప్పు, యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుణ్యక్షేత్రాల యాత్ర

రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని దంపతుల పర్యటన


దంపతులను సాగనంపుతున్న నాయకులు

బొంరాస్‌పేట: రేవంత్‌రెడ్డి అంటేనే ఆ కుటుంబానికి అపరిమిత అభిమానం. తాము ఊహించుకున్నట్టే రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మండల పరిధిలోని రేగడిమైలారానికి చెందిన జై కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరమేశ్వర్, భార్య పకిరమ్మ ఇంటి దైవం శ్రీశైల మల్లికార్జునస్వామిని, తిరుపతి, యాదగిరి గుట్ట పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని బుధవారం సాయంత్రం బయలుదేరారు. వీరిని గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు, జిల్లా అర్చకసంఘం అధ్యక్షుడు జయతీర్థాచారి ఆధ్వర్యంలో సాగనంపారు. సీఎం కోసం చేపట్టిన దంపతుల దర్శనం విజయవంతంగా సాగాలని కోరుకున్నారు. నాయకులు చంద్రప్ప, శేఖరయ్య, అశోక్‌రెడ్డి, దొడ్డప్ప, చిన్న నర్సింలు, కాశప్ప, రాజు, బాబు పాల్గొన్నారు.

కార్మికుడి దుర్మరణం

భవనంపై నుంచి కింద పడిన సంఘటన

మీర్‌పేట: భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన ఎర్ర బుగ్గయ్య(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. బుధవారం ఆయన వినాయకహిల్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించి స్లాబ్‌కు సెంట్రింగ్ డబ్బా కొడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి 3వ అంతస్తు నుంచి కిందపడ్డారు. తీవ్ర గాయాలవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బుగ్గయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. మీర్‌పేట పోలీసులు శాంతింపజేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు భవన యజమాని వెంకటేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బద్యానాయక్ తెలిపారు.

అందుబాటులో గడ్డికోత యంత్రాలు

పశువైద్య అధికారి దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: సబ్సిడీపై గడ్డి కోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవిరెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ త్రీహెచ్‌పీ, త్రీబ్లేడ్స్, త్రీ పేజ్ మోటర్స్ చాప్ కట్టర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. విశ్వకర్మ కంపెనీ యూనిట్ కాస్ట్ రూ.48 వేలు, సబ్సిడీ రూ.10వేలు తగ్గిస్తే రూ. 38వేలకే వస్తుందన్నారు. వర్ష కంపెనీ యూనిట్ కాస్ట్ రూ. 46,500 సబ్సిడీ రూ.10వేలు పోగా రూ. 36,500లకు ఇస్తున్నారన్నారు. పాడి పశువులు కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు మాత్రమే సబ్సిడీపై ఇవ్వనున్నారని వ్యవసాయ అధికారి తెలిపారు. దీని కోసం 15రోజులలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని దేవిరెడ్డి తెలిపారు.

నిరంతర నిషాకు ముగింపు ఎప్పుడు?

- జోరుగా బెల్టు షాపుల దందా
- మూసివేతకు ప్రభుత్వం కసరత్తు
- వైన్‌షాపు యజమానుల్లో గుబులు

పరిగి: పల్లె, పట్టణాలు అనే తేడా లేకుండా మద్యం ఏరులై పారుతోంది. ఊళ్లల్లో బెల్టుషాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఏ కిరాణ దుకాణాల్లోకి వెళ్లినా మద్యం అందుబాటులో ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో నామమాత్రంగా ఆంక్షలు విధించడంతో ఊరూరా బెల్టుషాపులు పుట్ట గొడుగుల్ల వెలిశాయి. ఏ అర్ధరాత్రి తలుపు తట్టినా మందు దొరికేది. గతంలో కొన్ని గ్రామాల్లో అయితే టెండర్ల తరహాల్లో బెల్టుషాపులు నిర్వహించేవారు. కానీ కొన్నేళ్లుగా ఊర్లల్లో ఇష్టానుసారంగా బెల్టు దుకాణాలు వెలవడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలు నిత్యం మద్యం మత్తులో ఉండటంతో అనేక మంది అనారోగ్యానికి గురైన సంఘటనలు ఉన్నాయి.

జేబులకు చిల్లు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 566 గ్రామ పంచాయతీలు ఉండగా 59 వైన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో బెల్టు దుకాణాలు ఉన్నట్టు ప్రాథమిక అంచనా. వీటి నిర్వాహకులు వైన్స్ దుకాణాల ద్వారా మద్యం తీసుకెళ్లి విక్రయించడంతో యజమానులు నెలకు రూ.3 లక్షల వరకు అదనంగా సంపాదిస్తున్నారు. మందుబాబుల బలహీనతను సొమ్ము చేసుకుంటూ బెల్టు షాపుల్లో క్వాటర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇష్టానుసారంగా బెల్టు దుకాణాల నిర్వహణతో మందుబాబుల జేబులకు చిల్లు పడుతున్నాయి. గ్రామాలు, దాబాల్లో మద్యం తాగి ఎంతో మంది నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నారు.



ప్రభుత్వం సీరియస్

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్టు దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు మూసివేయించారు. దీంతో పట్టణాలు, గ్రామాల్లో 90 శాతం మేర మద్యం అమ్మకాలు తగ్గాయి. ఎన్నికల కోడ్ ముగియడంతో పల్లెలు, పట్టణాల్లో బెల్టు దందా మళ్లీ ఊపందుకుంది. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు బెల్టు దుకాణాలపై సీరియస్‌గా ఉందని పలువురు చెబుతున్నారు. వాటిని మూయించేందుకు కసరత్తులు మొదలు పెట్టిందని సమాచారం. ఎక్కడెక్కడ బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారనే సమాచారం సేకరించి ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు అందిన వెంటనే చర్యలు తీసుకోనున్నారు.

కాంగ్రెస్ హామీ నెరవేరుస్తుందా!

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతుంది.. ఎన్నో కుటుంబాలు మద్యం ద్వారా రోడ్డున పడ్డాయని ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. అంతే కాకా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్రామాల్లో బెల్టు దుకాణాలు లేకుండా చేస్తామని ప్రజలకు, మహిళలకు హామీ ఇచ్చారు. దీంతో పల్లెల్లోని అతివలు కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా ఓట్లు వేశారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం బెల్టు దుకాణాల మూతకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. బెల్టు షాపులు మూత పడితే వీటి ద్వారా వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వస్తుందని వైన్ షాపు యజమానులు తలలు పట్టుకుంటున్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు సద్వినియోగించుకోవాలి
- పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా

కొడంగల్ రూరల్: రైతులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా అన్నారు. బుధవారం మండల పరిధిలోని విజయ కాటన్ మిల్లులో సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాకు రూ.7,020 చెల్లిస్తుందన్నారు. రైతులు పత్తి విక్రయించే సమయంలో తమతో పాటు బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్‌ల జిరాక్స్‌లు వెంట తీసుకొనిరావాలని అన్నారు. పత్తిలోని తేమ శాతం ఆధారంగా ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు పత్తిని లూజు రూపంలో తీసుకొనిరావాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీఐ అధికారి గజానంద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ దేవదత్తు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

ఇసుక వేలం

తాండూరు రూరల్: అనుమతి లేకుండా తరలించిన ఇసుకకు రెవెన్యూ అధికారులు వేలంపాట నిర్వహించారు. ఆర్‌ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. తాండూరు మండలం ఖాంజాపూర్ గ్రామానికి చెందిన గోసాయి హన్మంత్ ఈ నెల 14న స్థానిక వాగు నుంచి తాండూరు పట్టణానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ట్రాక్టర్‌లో ఉన్న ఇసుకను ఆర్‌ఐ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో బుధవారం వేలం పాట నిర్వహించగా ఖాంజాపూర్‌కి చెందిన ప్రకాష్ రూ.1,900 వేలం పాటలో దక్కించుకున్నారు. జిల్లా కలెక్టర్ పేరు మీద డీడీ కట్టుకొని రావాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆర్‌ఐ బాల్‌రాజ్ గ్రామస్తులకు హెచ్చరించారు.

శిఖం భూములను కాపాడండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

- దిర్సంపల్లి గ్రామస్తుల విజ్ఞప్తి
- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

దోమ: గ్రామంలో ఉన్న ప్రతి చెరువుకు సంబంధించిన శిఖం భూములు కబ్జాలకు గురయ్యాయని, అధికారులు వాటిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని దిర్సంపల్లి గ్రామస్తులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని కార్యాలయంలో తహసీల్దార్ పురుషోత్తానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనంబర్ 305, 267, 96లో చెరువులకు సంబంధించి శిఖం భూములు ఉన్నాయి. అయితే వాటికి అధికారులు పలుమార్లు సర్వేలు చేసి హద్దులు ఏర్పాటు చేసినా గ్రామానికి చెందిన కొంత మంది కబ్జాలకు పాల్పడి వ్యవసాయం చేసుకుంటున్నారు. సర్వేనంబర్ 47లో సైతం షేక్‌చాంద్ అనే రైతుకు కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం శిఖం భూమిని కేటాయించింది. దాన్ని గ్రామానికి చెందిన గొల్ల బాలయ్యకు విక్రయించగా, ఆయన నుంచి కె.బాల్‌రెడ్డి కొనుగోలు చేశారు. ఆ భూమిలో రైతు వ్యవసాయం సైతం చేసుకుంటున్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు బాల్‌రెడ్డిపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తూ కొనుగోలు చేసిన భూమిని శిఖం భూమి అంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేశారని తెలిపారు. అధికారులు పూర్తి స్థాయిలో సర్వేలు నిర్వహించి శిఖం భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, రాములుగౌడ్, బాల్‌రెడ్డి, రాంచంద్రరెడ్డి, బందెయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కబ్జాల పర్వం

- ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

మహేశ్వరం: బాలాపూర్ మండల పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జాల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మండల పరిధిలోని జల్‌పల్లి గ్రామంలోని 223 సర్వే నంబర్‌లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములలో నిర్మాణాలు కొనసాగుతుండగా.. తాజాగా మామిడిపల్లిలో కూడా కబ్జాల పర్వం ఆరంభమైంది. సర్వే నంబర్ 99/1లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల పేరుతో జీవో నంబర్ 59ను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటూ ఏకంగా ఓ కాలనీనే నిర్మించారు. బహిరంగ మార్కెట్‌లో గజం రూ.40–50 వేలు పలుకుతున్న తరుణంలో ప్రభుత్వ భూములపై తమకెందుకు హక్కు ఉండదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మిగిలిన ప్రభుత్వ భూమిలో ఎవరికి తోచిన విధంగా వారు కంచెలు ఏర్పాటు చేసుకోవడం, హద్దురాళ్లు పాతుకోవడం ప్రారంభించారు. రెండు రోజులుగా ఈ విషయమే గ్రామంలో హాట్ టాఫిక్‌గా మారింది. రెవెన్యూ అధికారులు ఇకనైనా మేల్కొని కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదు.


మామిడిపల్లిలోని ప్రభుత్వ భూమిలో ప్రారంభమయిన అక్రమ నిర్మాణాలు

స్థలమిచ్చారు.. నిధులిస్తారు


కోస్గి బస్సు డిపో

- కోస్గి డిపోకు స్థలాన్ని దానమిచ్చిన 'ఎనుముల'
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అరకొర బస్సులతో నిర్వహణ
- రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో అభివృద్ధిపై చిగురించిన ఆశలు


మొదటిసారి శంకుస్థాపన చేస్తున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో నిర్మించిన ఆర్టీసీ బస్ డిపో స్థలాన్ని తొమ్మిది ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించారు. కోట్ల రూపాయల విలువ చేసే నాలుగు ఎకరాల స్థలాన్ని ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉచితంగా అందజేశారు. అయితే రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం బస్ డిపో నిర్మాణంలో జాప్యం చేసింది. 2018లో నాటి మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డిలు డిపో నిర్మాణానికి భూమి చేశారు. నిర్మాణంలో జాప్యం చేస్తూ ఎట్టకేలకు డిపోను ప్రారంభించారు. అప్పటి నుంచి ఈరోజు వరకు కేవలం 11 బస్సులతో డిపో నడుస్తోంది. చాలీ చాలని బస్సులతో రవాణా వ్యవస్థ అధ్వానంగా మారింది. నాటి స్థల దాత ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. దీంతో త్వరలో డిపోకు మంచి రోజులు రానున్నాయని రూపురేఖలు మారుతాయని స్థానికులు భావిస్తున్నారు.

మొదటిసారి శంకుస్థాపన

కోస్గి బస్సు డిపో నిర్మాణానికి మొదటిసారి 2014లో ఆర్టీసీ చైర్మన్ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అయితే ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. నియోజకవర్గంలో బస్సు డిపో నిర్మించాలనే ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సొంతంగా కోస్గిలో 4 ఎకరాల స్థలం కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించారు.

రెండోసారి

ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 2018లో అప్పటి మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డిలు రెండోసారి శంకుస్థాపన చేశారు. నాటి ఎన్నికల్లో రేవంత్ ఓడిపోయారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి గెలిచారు. అనంతరం అరకొర నిధులు మంజూరు చేసి డిపో నిర్మాణానికి టెండర్లు పిలిచారు. మూడేళ్ల తర్వాత డిపోను ప్రారంభించారు. నాణ్యత లేని 10 ఆర్డినరీ బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్‌ను డిపోకు కేటాయించి చేతులు దులుపుకొన్నారు.

వాస్తవ పరిస్థితులు

కోస్గి నియోజకవర్గంలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ప్రాంతం. రవాణా వ్యవస్థ ఇక్కడి ప్రజలకు అందుబాటులో లేదు. గ్రామీణ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నారాయణపేట, తాండూరు, పరిగి, హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లతో పాటు కర్ణాటక డిపో బస్సులపై ఆధారపడి ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోస్గిలో బస్సు డిపో నిర్మిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని రేవంత్‌రెడ్డి భావించారు.


బస్సును ప్రారంభిస్తున్న నాటి మంత్రి మహేందర్‌రెడ్డి

జిల్లా కేంద్రానికి బస్సులు కరువు

కొడంగల్ నుంచి నేరుగా వికారాబాద్ జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి కొడంగల్ నుంచి జిల్లా కేంద్రానికి పల్లె వెలుగు బస్సును ప్రారంభించారు. వారం రోజులు తిరగక ముందే బస్సును అధికారులు రద్దు చేశారు. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్టీసీ అధికారులు స్పందించలేదు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే రెండు బస్సులు ఎక్కి దిగాల్సి వస్తోంది. పరిగి నుంచి వెళితే 52 కిలోమీటర్లు, తాండూరు నుంచి వెళితే 63 కిలోమీటర్ల దూరం అవుతోంది. రాకపోకలకు ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి


భూ బాధితులతో మాట్లాడుతున్న పామెన భీంభరత్

కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: చందనవెళ్లి భూ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. బుధవారం చందనవెళ్లి గ్రామంలో ఆయన భూ బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పామెన భీంభరత్ మాట్లాడుతూ రైతులు తమకు అన్యాయం జరుగుతుందని ఆర్డీఓ, ఎమ్మెల్యే, కేటీఆర్‌కు వివరించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. హైతాబాద్ చౌరస్తాలో 40 రోజులపాటు నిరాహార దీక్ష చేస్తే ముడుపులు అందిన బీఆర్‌ఎస్ నాయకులు రాత్రికి రాత్రే దీక్ష శిబిరాన్ని తొలగించి రైతులను భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా అప్పటి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతో చందనవెళ్లి భూనిర్వాసితులు తమ 2వేల ఎకరాల భూమిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కుందన్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికాంలోకొచ్చిన వెంటనే తగిన న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చిన విషయాన్ని భీం భరత్ గుర్తు చేశారు. ఈ విషయంలో రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని భీం భరత్ తెలిపారు. వేమారెడ్డి, చేవెళ్ల స్వామి, రాంచంద్రయ్య, సలీం, సత్తయ్య, కిష్టయ్య, నర్సింహులు, మల్లయ్య, శ్రీనివాస్, శోభ, ఇంద్రమ్మ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' పేరిట మోసానికి యత్నం

అనుమానంతో పోలీసులకు పట్టించిన గ్రామస్తులు


నిందితుడు పరమేశ్వర్

పెద్దేముల్: 'గృహలక్ష్మి' ద్వార ఇళ్లు ఇప్పిస్తానని ఓ యువకుడు జనాలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేసిన సంఘటన బుధవారం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల పాషాపూర్ తండాకు చెందిన ఛవాన్ పరమేశ్వర్(19) గొట్లపల్లి గ్రామంలో నిరుపేదలకు ఇల్లు, స్థలం ఉన్న వారికి కట్టుకునేందుకు రూ.5లక్షల వరకు ఇస్తానని చెప్పాడు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని గృహలక్ష్మి దరఖాస్తు ఫారాన్ని, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు ఫారాలు తీసుకొని జనాలను నమ్మించే ప్రయత్నం చేశాడు. తనను ప్రభుత్వం నుంచి పంపించారని, ఇల్లు అవసరం ఉన్న వారు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తీసుకురావాలని చెప్పడంతో జనాలు నమ్మారు. గ్రామంలో పలువురి వద్ద నుంచి దరఖాస్తు ఫారం నింపి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వచ్చిందని చూయించాడు. కానీ అతని ప్లాన్ చివరకి బెడిసికొట్టింది. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చంద్రప్ప అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు విషయం చెప్పడంతో గుట్టు రట్టయింది. పంచాయతీ కార్యదర్శి విచారణ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు


అక్రమ నిర్మాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

- ఇళ్లను కూల్చి వేయాలని కోర్టు తీర్పు
- దేవాదాయ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

కొందుర్గు: దేవాలయ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను తొలగించాల్సిందేనని దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ బుధవారం ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. కొందుర్గులోని శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై ట్రిబ్యునల్ కోర్టులో కేసులు వేశారన్నారు. మొత్తం 72 కేసులు నమోదు కాగా, 12 కేసులకు సంబంధించి దేవాలయానికి అనుకూలంగా తీర్పు వెలువడిందన్నారు. కొందుర్గు, లూర్దస్‌నగర్ గ్రామాల్లో కలిసి ఇన్నారెడ్డి, ప్రశాంత్, అంజమ్మ, సాదక్, లింగమయ్య, ఇబ్రహీం, రామచంద్రయ్య, అంజమ్మ, బాల్‌రాజ్, రాజు ఇళ్లను స్వాధీనం చేసుకోవడానికి ఇదివరకే నోటీసులు జారీ చేశామన్నారు. దేవాలయ ఆస్తులను కాపాడటంలో తగిన చర్యలు తీసుకుంటామని, ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని అన్నారు. ఈ సందర్భంగా అధికారుల బృందం ఆయా గ్రామాలను సందర్శించి ఇళ్లను పరిశీలించి, ఖాళీ చేయాలని ఆదేశించారు. తమకు మరో పదిహేను రోజులు గడువు ఇవ్వాలని స్థానికులు కోరడంతో అధికారులు అంగీకరించారు. అనంతరం అధికారులు కొందుర్గు, పెండ్యాల శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, అధికారులు ప్రవీణ్, చంద్రమోహన్, ఆంజనేయులు, ఈఓ శ్రీనివాస శర్మ, దేవాలయ కమిటీ చైర్మన్ గోపాల్, ఉప సర్పంచ్ రాజా రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మురుగు కాల్వలో మృతశిశువు

- ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించిన పోలీసులు
- కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గుర్తు తెలియని శిశువు మృతదేహం

షాద్‌నగర్ రూరల్: తల్లి గర్భంలో నుంచి వచ్చి వెచ్చని పొత్తిళ్లలో ఉండాల్సిన ఓ నవజాత శిశువు మురుగు కాల్వలో కనిపించింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన వారే మురుగు నీటిలో పడేశారు. దీంతో పేగు బంధాన్ని తెంచుకున్న ఆ శిశువు ఆయువు అనంత లోకాలకు చేరింది. ఈ హృదయ విదారక సంఘటన బుధవారం షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని ఓపెన్ డ్రైనేజీలో గుర్తు తెలియని మగ శిశువు మృతదేహం పారుతున్న మురుగు నీటిలో కొట్టుకుపోతూ కనిపించింది. ఇది గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు.


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మృత శిశువును పడవేసి ఉంటారా?

కాల్వలో దొరికిన శిశువు బొడ్డు కూడా ఊడలేదు. కొద్ది గంటల క్రితమే జన్మించిన ఆనవాళ్లు కనిసిస్తున్నాయి. శిశువు గర్భంలోనే మృతి చెందాడా..? పుట్టిన కొద్ది సేపట్లోనే మరణించాడా..? అనే అనుమానాలు వ్యక్తవుతున్నాయి. ఒకవేళ చనిపోయి ఉంటే చిన్నారి దేహాన్ని పాతిపెట్టాల్సిన వారు మురుగు కాల్వలో పడవేశారా..? అనేది తెలియరాలేదు. ఎస్‌ఐ శరత్‌కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు తెలియకపోవడంతో శిశువు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్ తెలిపారు.

క్షయ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

కొందుర్గు: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఇందులో భాగంగానే అన్ని గ్రామాల్లో వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. అందరు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ తీసుకోవాలని సూచించారు. కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. దీనికోసం మహిళా వైద్యులే పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, ఏడీఏ రాజారత్నం, మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, పీహెచ్‌ఎస్ ప్రభులింగం, లుదియా, ఏపీజీవీబీ బ్యాంక్ సిబ్బంది, బీజేపీ నేతలు అందె బాబయ్య, భూపాలచారి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయలక్ష్మి